క్లుప్తంగా

పంటల పరిశీలన



మానవపాడు: మండలంలోని నారాయణపురం, చందాపూర్, పెద్దఆముదాలపాడు గ్రామాల్లో సాగు చేసిన పంటలను గురువారం ఏడీఏ సక్రియానాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా రైతులు జాగ్రత్తలు పాటించాలని కోరారు. నీటివసతి ఉన్న రైతులు పంటలను కాపాడుకునేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ దశరథరామయ్య పాల్గొన్నారు.

పౌష్టికాహారం తప్పనిసరి

మల్దకల్: గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని డాక్టర్ స్వరూపారాణి సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం గర్భిణులు, బాలింతలకు వైద్యపరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు ప్రతినెలా పరీక్షలు చేయించుకొని వైద్యుల సలహాలు, సూచనలు పాటించాలని సూచించారు. గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే కాన్పు చేయించుకోవాలని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

మల్దకల్: మండలంలోని పలు గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగరాణి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని గర్భిణులు, బాలింతలను కోరారు. బరువు, ఎత్తు తక్కువగా ఉన్న చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు.

హక్కులపై అవగాహన ఉండాలి



మానవపాడు: పౌరహక్కులపై అందరికీ అవగాహన ఉండాలని ఆర్‌ఐ రజనీకాంత్‌రెడ్డి అన్నారు. మండలంలోని బోరవెల్లిలో గురువారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ సమానత్వంతో మెలగాలని సూచించారు. పౌరుల హక్కులకు భంగం కలిగిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

మల్దకల్: మండలంలోని కుర్తిరావల్‌చెర్వులో సర్పంచ్ జయమ్మ ఆధ్వర్యంలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌ఐ రామకృష్ణ, ఏఎస్‌ఐ ఈశ్వరయ్య మాట్లాడుతూ రెండు గ్లాసుల పద్ధతి అవలంబించడం, కులవివక్ష పాటించడం చట్టరీత్యా నేరమన్నారు. కులమతాలకు అతీతంగా అందరూ కలిసిమెలసి ఉండాలని సూచించారు.

గొర్రెల పంపిణీ



అయిజ: మండల కేంద్రంలో కురుమ యాదవులకు మంజూరైన 6 యూనిట్ల సబ్సిడీ గొర్రెలను గురువారం వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ స్వరూపారాణి పంపిణీ చేశారు. అదేవిధంగా పర్దీపురం, ఎక్లాస్‌పురం గ్రామాల్లో 405 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసే కార్యక్రమం శుక్రవారంతో ముగుస్తుందని తెలిపారు.

వర్షాల కోసం పూజలు

అయిజ: వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని కాంక్షిస్తూ గురువారం మండలంలోని కిష్టాపురంలో రైతులు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలోని అలీ సాహెబ్ దర్గా అశ్వంతో తుంగభద్ర నదికి వెళ్లి గంగమ్మకు పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి నదీజలం, మట్టి తీసుకొచ్చి సీతారాముడు, లక్ష్మణుడు, ఆంజనేయస్వామి విగ్రహాలను అభిషేకించి ప్రత్యేక పూజలు చేశారు.

ఆర్థికసాయం అందజేత

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన గోవిందమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న పోతురాజు శంకరమ్మ సేవాదళం సభ్యులు గురువారం మృతురాలి కుటుంబసభ్యులను పరామర్శించి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. రాముడు, సాయిబాబా, తిమ్మన్న, వెంకటేశ్వర్లు, రామకృష్ణ పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు

ఉండవెల్లి: బైక్‌పై నుంచి పడి వ్యక్తికి గాయాలైన ఘటన అలంపూర్ చౌరస్తా సమీపంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. కర్నూల్ నుంచి రైల్వే ఉద్యోగి మనోహర్ బైక్‌పై వస్తుండగా, చౌరస్తా సమీపంలో అదుపుతప్పి కిందపడ్డాడు. ప్రమాదంలో అతడికి గాయాలు కావడంతో స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం కర్నూల్ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.



కేటీదొడ్డిలో..



శాంతినగర్ మండలం కొంకలలో..



ఇటిక్యాల మండలం వేములలో..



మల్దకల్ మండలం అమరవాయిలో..

ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

అలంపూర్: అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల ప్రేమానురాగాలకు ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ వేడుకలను జిల్లావ్యాప్తంగా గురువారం ఘనంగా నిర్వహించారు. చిన్నా, పెద్ద తేడా లేకుండా ఆడపడుచులు తమ సోదరులకు రాఖీ కట్టి ఆశీర్వదించారు. అలంపూర్ చౌరస్తాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే అబ్రహంకు క్యాతూరు మహిళా సంఘాల సభ్యులు రాఖీ కట్టి మిఠాయి తినిపించారు. అనంతరం మహిళా సంఘం కమ్యూనిటీహాల్ నిర్మాణానికి రూ.5లక్షల ప్రొసీడింగ్‌ను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లలితమ్మ, వీఓఏలు లావణ్య, రియాజ్, మున్ని, స్వాతి, ఛాయాదేవి, గుండమ్మ, రవి పాల్గొన్నారు.

ధరూరు: రక్షా బంధన్ వేడుకలను పురస్కరించుకుని మండల కేంద్రంలో జెడ్పీటీసీ పద్మ, ఎంపీటీసీ డీఆర్ శివలీల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డికి రాఖీ కట్టారు. అనంతరం మిఠాయి తినిపించి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలో రాఖీ పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నాతమ్ముళ్లకు అక్కాచెల్లెళ్లు రాఖీలు కట్టి ఆశీర్వదించారు.

మల్దకల్: రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అన్నాతమ్ముళ్లకు తమ సోదరీమణులు రాఖీ కట్టి ఆశీర్వదించారు. ఎంపీపీ రాజారెడ్డి, జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ తిమ్మారెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు రాములు మండల ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

అయిజ: రక్షాబంధన్ వేడుకలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఆడపడుచులు రాఖీ కట్టి మంగళహారతి పట్టగా, సోదరులు కానుకలు సమర్పించి ఆశీర్వాదం పొందారు.

కేటీదొడ్డి: మండలంలోని గ్రామాల్లో రాఖీ పండుగను ఘనంగా నిర్వహించారు. ఒకరినొకరు రాఖీలు కట్టుకొని సోదరభావాన్ని చాటారు.



అలంపూర్‌లో ఎమ్మెల్యే అబ్రహంకు రాఖీ కడుతున్న మహిళా సంఘాల సభ్యులు

శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీ, మండలంలో రాఖీ వేడుకలను ఆనందోత్సవాల మధ్య నిర్వహించారు. ఈ సందర్భంగా ఆడపడుచులు తమ సోదరులకు రాఖీ కట్టి దీవించారు. అదేవిధంగా పౌర్ణమిని పురస్కరించుకొని సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరించారు.

గట్టు: రాఖీ పౌర్ణమి వేడుకలను మండలంలో ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ విజయ్‌కుమార్‌కు యల్లందొడ్డి సర్పంచ్ రాధిక రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు.



అయిజలో..



ధరూరులో ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డికి రాఖీ కడుతున్న జెడ్పీటీసీ పద్మ



గట్టులో ఎంపీపీ విజయ్‌కుమార్‌కు రాఖీ కడుతున్న సర్పంచ్ రాధిక

బీజేపీలో చేరిక



గద్వాల: మండలంలోని గోనుపాడు, సంగాల గ్రామాలకు చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు గురువారం బీజేపీలో చేరారు. వీరికి బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. బీఆర్‌ఎస్ అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గడ్డం కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

4న సంయుక్త కిసాన్ మోర్చా సదస్సు



గట్టు: జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీఓ భవనంలో సెప్టెంబర్ 4న సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా సదస్సు నిర్వహించనున్నట్లు తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాల్ తెలిపారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్పొరేట్లకు వ్యవసాయ రంగాన్ని కట్టబెట్టే మూడు నల్లా చట్టాలను పూర్తిస్థాయిలో రద్దు చేయాలని, జాతీయ విద్యుత్ సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ ఉత్పత్తులపై మద్దతు ధర గ్యారెంటీ చట్టాన్ని తీసుకురావాలన్నారు. కౌలు రైతులకు రైతుబంధు, బీమా, పంట నష్ట పరిహారం చెల్లించేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా డిమాండ్లపై ఏర్పాటు చేసిన సదస్సుకు రైతులు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. తిమ్మప్ప, నాగరాజు, రంగప్ప, చెన్నారెడ్డి ఉన్నారు.

కులవృత్తిదారులకు సర్కారు చేయూత

ధరూరు: బీసీ కులవృత్తిదారులకు ప్రభుత్వం చేయూతనందిస్తోందని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం బీసీబంధు, కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదింటి ఆడపడుచుల పెళ్లికి ప్రభుత్వం రూ.లక్షా 116 అందించి ఆదుకుంటున్నట్లు తెలిపారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తామన్నారు. బీసీ బంధు సాయంతో లబ్ధిదారులు కులవృత్తిలో రాణించాలని సూచించారు. త్వరలోనే గృహలక్ష్మి, దళితబంధు, మైనార్టీబంధు పథకాలను అర్హులకు అందజేస్తామని తెలిపారు. మండలంలో 173మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసినట్లు చెప్పారు. అనంతరం ఉచిత బీమా నమోదు నమోదు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు.

ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి

గద్వాల రూరల్/గట్టు: ప్రజారోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పాతబస్టాండ్, గట్టు మండల కేంద్రంలో రూ.5లక్షల ఉచిత బీమా నమోదు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో రూ.2లక్షల వరకే పరిమితి ఉన్న ఆరోగ్యశ్రీని ప్రస్తుతం రూ.5లక్షలకు పెంచినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ బీమా చేయించుకోవాలని కోరారు. అదేవిధంగా మండలంలోని పరమాలలో ఇంటింటికీ కిష్టన్న కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రామన్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, జెడ్పీటీసీ పద్మ, ఎంపీపీ విజయ్‌కుమార్, వైస్‌ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు డీఆర్ విజయ్‌కుమార్, సర్పంచ్ పద్మమ్మ, ఎంపీటీసీలు శివలీల, దౌలన్న, నాగర్‌దొడ్డి వెంకట్రాములు, రామకృష్ణారెడ్డి, సంతోష్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీధర్, పురుషోత్తంరెడ్డి, సంజీవ్, అబ్రహం పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహాల ప్రతిష్ఠాపన

అయిజ: పట్టణ సమీపంలోని అభయాంజనేయ స్వామి ఆలయం పక్కన నూతనంగా నిర్మించిన శివాలయంలో గురువారం దేవతా విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు కుటుంబ సమేతంగా దేవతా విగ్రహాలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాల వితరణతోపాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



పూజలు చేస్తున్న భక్తులు

ఘనంగా ప్రభోత్సవం



అమరచింత: నూలు పౌర్ణమిని పురస్కరించుకొని గురువారం పట్టణంలోని భక్త మార్కండేయ ఆలయంలో పద్మశాలీలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈమేరకు ఆలయం నుంచి పట్టణ పురవీధుల గుండా ప్రభోత్సవం చేశారు. ఈ సందర్భంగా పద్మశాలి పట్టణ అధ్యక్షుడు దేవరకొండ లక్ష్మన్న మాట్లాడుతూ తమ కుల వృత్తి అయిన చేనేతకు అవసరం అవుతున్న నూలు పోగు పుట్టిన రోజును పురస్కరించుకొని నూలు పౌర్ణమిని ప్రతి ఏడాది వైభవగా జరుపుకుంటామని తెలిపారు. ఆలయంలో ప్రత్యేక పూజలతో పాటు అన్నదానం ఏర్పాటు చేశారు.

కేసు నమోదు

ఆత్మకూర్: విద్యుదాఘాతంతో మృతిచెందిన కార్మికుడు బాలకృష్ణ (22) కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఏఎస్‌ఐ బీచుపల్లి తెలిపారు. బుధవారం భవన నిర్మాణ పనుల్లో విద్యుదాఘాతానికి గురై మహబూబ్‌నగర్‌లో చికిత్స పొందుతూ బాలకృష్ణ మృతి చెందాడు. గురువారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి శవాన్ని కుటుంబసభ్యులకు అప్పగించామన్నారు.

బీఆర్‌ఎస్ నుంచి పోటీలో ఉంటా..



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకురాలు ప్రేమలత

అయిజ: అలంపూర్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ తరపున ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని ఆ పార్టీ నాయకురాలు ప్రేమలత అన్నారు. పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథిగృహం ఆవరణలో గురువారం పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే అబ్రహంపై ప్రజల్లో విపరీతమైన వ్యతిరేకత ఉందని, పార్టీ అభ్యర్థి ఓడిపోయే పరిస్థితులు ఉన్నాయన్నారు. పూర్తిస్థాయి సర్వే అనంతరం సీఎం కేసీఆర్ తనకు బీఫాం ఇస్తారన్న నమ్మకం ఉందన్నారు. బీఆర్‌ఎస్ నుంచి బీఫాం ఇవ్వకున్నా పోటీలో ఉంటానని స్పష్టం చేశారు. సమావేశంలో బీఆర్‌ఎస్ జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య, కృష్ణ, రమేష్, తిమ్మప్ప తదితరులు ఉన్నారు.

సీఎల్పీ నేత భట్టివిక్రమార్కకు ఘనస్వాగతం

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలం ఎర్రవల్లి చౌరస్తాలో గురువారం సీఎల్పీ నేత భట్టి విక్రమార్కకు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. హైదరాబాద్ నుంచి తిరుపతికి వెళ్తుండగా, డీసీసీ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు పుష్పగుచ్ఛం అందజేసి, గజమాల, శాలువాతో సత్కరించారు. అనంతరం స్థానిక ఆడపడుచులు ఆయనకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గంజిపేట శంకర్, విజయ్‌కుమార్, రాజీవ్‌రెడ్డి, జోగుల రవి, వెంకటేష్, రుక్మందర్‌రెడ్డి, రాజు పాల్గొన్నారు.



ఎర్రవల్లి చౌరస్తాలో భట్టి విక్రమార్కకు స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ నాయకులు

ప్రజావ్యతిరేక విధానాలను వీడాలి

గద్వాల అర్బన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను వీడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిత్యావసర ధరలు విపరీతంగా పెరగడంతో పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎన్నికల సందర్భంగా ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇచ్చిన హామీ అమలుకు నోచుకోలేదన్నారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలో లక్షలాది ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, దేశంలో ఉపాధి అవకాశాలను దెబ్బతీస్తూ కార్పొరేట్లకు లాభాలను కట్టబెడుతున్నట్లు తెలిపారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. సెకండ్ ఏఎన్‌ఎంలు, సమగ్రశిక్ష ఉద్యోగులు, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీలు ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నా పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి వారం రోజులపాటు గ్రామ, మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఉప్పేరు నర్సింహ, లక్ష్మన్న, నరేష్, ఆనంద్, ఈరన్న, గోవిందు తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటస్వామి

‘కస్తూర్బా’లో సమస్యలు తీరలె..

- గదుల కొరతతో విద్యార్థినుల అవస్థలు
- సమస్యలు పరిష్కరించాలని వేడుకోలు



పాడైన ఫిల్టర్‌మిషన్



కస్తూర్బాలో 300మందికిపైగా విద్యార్థినులు ఉండే గది

మానవపాడు: విద్యావ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు చేస్తున్నా విద్యార్థినులకు ఇబ్బందులు తప్పడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమికోన్నత స్థాయిలో మగపిల్లల కంటే బాలికల నమోదు చాలా తక్కువ ఉంటోంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని బాలికల విద్యను ప్రోత్సహించాలనే లక్ష్యంతో హాస్టల్ వసతి కలిస్తూ కస్తూర్బాగాంధీ విద్యాలయాలను ఏర్పాటు చేశారు. లక్ష్యం బాగున్నా నిర్వహణ మాత్రం అస్తవ్యస్తంగా తయారైంది. విద్యాలయాలు కష్టాలకు నిలయాలుగా మారాయని విద్యార్థినులు, తలిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కస్తూర్బాలో ప్రధానంగా గదుల కొరత, ఫిల్టర్ వాటర్ మరమ్మతులు లేక చాలా కాలం అవుతోంది. విద్యార్థినులు తరగతి గదుల్లో పడుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. వర్షమొస్తే కొన్ని చోట్ల గదులు కురుస్తున్నాయి.

స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో 6నుంచి 10వ తరగతి వరకు మాత్రమే విద్యనభ్యసించేందుకు వీలుండేది. మొత్తం 251మంది విద్యార్థినులు ఉన్నారు. ప్రభుత్వం పేద, మధ్య తరగతి అమ్మాయిల కోసం గతేడాది నుంచి కస్తూర్బాలో ఇంటర్మీడియట్ స్థాయికి పెంచింది. సీఈసీ, ఎంఎస్‌డబ్ల్యూ కోర్సులు కళాశాలలో ఏర్పాటు చేశారు. ఇంటర్మీడియట్‌లో సీఈసీ, ఎంఎస్‌డబ్ల్యూకు సంబంధించి 56 మంది విద్యార్థినులు ఉన్నారు. విద్యార్థినుల కోసం నిర్మించిన తరగతి గదిలో 251 మంది నిద్రించడానికి అవస్థలు పడుతున్నారు. వీరికి తోడు ఇంటర్ విద్యార్థినులు చేరడంతో ఒకే గదిలో అందరూ నిద్రపోవడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాల స్థాయి పెరిగినా సమస్యలు తీరడం లేదు.

గదులు నిర్మించి ఇబ్బందులు తీర్చండి..



కొన్నేళ్లుగా ఒకే గదిలో నివాసం ఉంటున్నాం. ఆ గదిలో 250 మంది విద్యార్థినులం పెట్టెలు, దుప్పట్లు, వస్తువులతో ఉండాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. చాలాకాలంగా గదులు నిర్మించాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– శైలజ, 10వ తరగతి, కస్తూర్బాగాంధీ, మానవపాడు

ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లాం..



గదుల కొరత, ఫిల్టరు మిషన్ సమస్యలు ఉన్నాయి. వర్షం పడినప్పుడు తరగతి గదుల్లో ఊరుస్తోంది. ప్రజాప్రతినిధులు అధికారులకు చెప్పినా చర్యలు తీసుకోవడం లేదు.

– చామంతి, 9వ తరగతి, కస్తూర్బాగాంధీ, మానవపాడు

ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతాం..

కస్తూర్బాలో 6 నుంచి 10వ తరగతి విద్యార్థినులకు తోడుగా ఇంటర్ వారు వచ్చారు. దీంతో తరగతి గదుల్లో వసతి పొందేందుకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. నివేదికలను తయారు చేసి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరగా గదులు నిర్మించేలా చర్యలు తీసుకుంటాం.

– శివప్రసాద్, ఎంఈఓ, మానవపాడు

‘బెదిరింపులకు పాల్పడడం సరికాదు’



సీపీఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులుకు రాఖీ కడుతున్న ఏఎన్‌ఎంలు

గద్వాల అర్బన్: తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని సమ్మె చేస్తున్న కాంట్రాక్టు ఏఎన్‌ఎంలపై ప్రభుత్వం బెదిరింపులకు పాల్పడడం సరికాదని సీపీఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు అన్నారు. జిల్లా కేంద్రంలో ఏఎన్‌ఎంలు చేపట్టిన సమ్మె గురువారంతో 16వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఎన్‌ఎంలను బెదిరింపులకు గురిచేసేలా ఉద్యోగాల నుంచి తొలగించాలని అధికారులకు ఆదేశాలు ఇవ్వడం సిగ్గుచేటన్నారు. ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేసే వరకు సమ్మెను విరమించే ప్రసక్తే లేదన్నారు. అనంతరం సమ్మె శిబిరంలో రక్షా బంధన్ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ రంగన్న, పద్మమ్మ, రాధ, స్వరూప, నాగలక్ష్మి, జ్యోతి, రమాదేవి, సుజాత పాల్గొన్నారు.

అంతర్జాతీయ ఖోఖో పోటీలకు ఎంపిక

పెబ్బేరు రూరల్: మండలంలోని యాపర్లకు చెందిన రుక్మిణి అంతర్జాతీయ ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు గురువారం గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన కావలి చిన్ని వీరస్వామి కుమార్తె రుక్మిణి మలేషియాలో అక్టోబర్‌లో నిర్వహించనున్న ఇంటర్నేషనల్ ఖోఖో పోటీలో రాష్ట్రం తరఫున పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు రుక్మిణిని అభినందించారు. పోటీలో విజేతగా నిలిచి గ్రామానికి గుర్తింపు తేవాలని ఆకాంక్షించారు.



రుక్మిణి